సాక్షి పల్నాడు

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



శీతలాంబ ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలో శీతలాంబ ఆలయం 34వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నారు.



దేవస్థానం వార్షికోత్సవం

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


27న చండీ హోమం



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో 27న అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ కె. సునీల్ కుమార్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఒరిగిన రామలింగేశ్వర ఆలయ శిఖరం



అమరావతి: అమరావతిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు రామేశ్వరం యాత్రకు వెళ్లి, గుర్తుగా రామలింగేశ్వర విగ్రహం తీసుకొచ్చి ప్రతిష్ఠించి, స్థానికంగా ఆలయ నిర్మాణం చేశారు. అప్పటినుంచి ఆలయంలోని రామలింగేశ్వరునికి నిత్యపూజలు జరుగుతున్నాయి. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయం ఏళ్లతరబడి ఆదరణ లేక నిర్లక్ష్యానికి గురైంది. ఈక్రమంలో ఇటీవల గాలివానకు ఆలయ విమాన శిఖరం ఒరిగి వేలాడుతోంది. ఆలయ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆలయ శిఖరానికి దూరం నుంచి నమస్కారం చేసుకుంటే స్వామివారికి నమస్కరించినట్లేనని భక్తుల నమ్మకం. అటువంటి శిఖరానికి అపచారం జరిగినా పట్టించుకోని దేవాలయ అధికారులపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి విస్తరణ సలహా మండలి సమావేశాలు


గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో 2024–25 ఏడాదికిగానూ కృష్ణ మండలం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు లాంఫాం ఏడీఆర్ డాక్టర్ దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో రెండు రోజులపాటు సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గత ఏడాది కార్యచరణ, సలహాల మేరకు చేపట్టిన కార్యక్రమాలు, ప్రగతి, రానున్న ఏడాది నిర్వహించే కార్యక్రమాలు, పరిశోధన, విస్తరణపై చర్చలు జరుగుతాయన్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొంటారన్నారు.

ఘనంగా సివిల్ సర్వీసెస్ డే



నరసరావుపేట: సివిల్ సర్వీసెస్ డేను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయలను అధికారులు సత్కరించారు. సోమవారం టౌన్‌హాలులో వారిద్దరికీ దుశ్శాలువాలు కప్పి పూలదండలు వేసి శుభాకాంక్షలు తెలియచేశారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 3.02 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ. 3.02 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 18 రోజులకుగాను రూ. 3,02,92,986 నగదు, 440 గ్రాముల బంగారం, 5.225 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ తెలిపారు. కానుకల లెక్కింపును ఈవో పర్యవేక్షించగా, ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ అధికారులు, సిబ్బంది, సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా జడ్జిగా కల్యాణ్ చక్రవర్తి బాధ్యతలు



గుంటూరు లీగల్ : జిల్లా జడ్జిగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బి.కల్యాణ్ చక్రవర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ తుబాటి శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మనాయక్‌లు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. సెక్రటరీ నవీన్, స్టేట్ జనరల్ సెక్రటరీ పి. రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ బ్రహ్మయ్య, శేషగిరి, హరిబాబు, ఖాజా, కల్యాణి పాల్గొన్నారు.

మూడు స్కీములు, ఆరు స్కాములతో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట నిత్యం వార్తల్లో నిలుస్తోంది. నిన్న మొన్నటి వరకు సాయి సాధన ఉదంతంతో ఉక్కిరిబిక్కిరి అయిన పట్టణ వాసులు తాజాగా యానిమేషన్ స్కాం మాయలో పడి నిండా మునిగారు. రూ.వందల కోట్లు పెట్టుబడులు పెట్టినా సరైన ఆధారాలు లేక, ఎవరికి చెప్పుకోవాలో తెలీక లోలోన మధన పడుతున్నారు. పోలీస్ స్టేషన్ గడప తొక్కితే అసలు పెట్టుబడి పెట్టిన కాసులకు లెక్కలు అప్పజెప్పమంటారేమోనని వెనకడుగు వేస్తున్నారు. సాయిసాధన చిట్‌ఫండ్ స్కాం జరిగి మూడు నెలలు అవుతున్నా బాధితులకు నేటికీ ప్రభుత్వం నుంచి న్యాయం జరగకపోవడంతో ఇక తమకేమి భరోసా వస్తుందన్న మీమాంసలో యానిమేషన్ స్కాం బాధితులున్నారు.

అంతా..గప్‌చుప్

యానిమేషన్ స్కాంలో రూ. కోట్లు పోతున్నా ఫిర్యాదుకు బాధితులు వెనకడుగు


- విజయవాడ కేంద్రంగా యానిమేషన్ స్కాం.. బాధితుల్లో నరసరావుపేట వాసులే అధికం
- ఒక్కొక్కరి వద్ద రూ.కోట్లు వసూలు చేసిన స్కామర్ కిరణ్
- కనీసం కార్యాలయ సీల్, అడ్రస్ కూడా లేకుండా అగ్రిమెంట్ కాగితాలు జారీ
- న్యాయపరంగా వెళ్లాలంటే చెల్లవేమోనన్న భయం
- పెట్టుబడి పెట్టింది బ్లాక్‌మనీ కావడంతో ఫిర్యాదుకు అవకాశం లేదంటూ వాపోతున్న వైనం
- అధిక వడ్డీల ఆశతో గుల్లవుతున్న ప్రజలు



సాక్షి, నరసరావుపేట / నరసరావుపేట టౌన్: సాధారణంగా రూ.వెయ్యి పోతే.. పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీసి ఫిర్యాదు చేస్తాం. దొంగతనం చేసింది ఎవరో తెలిస్తే వెంటనే అతన్ని పట్టుకొని నగదు రికవరీకి ప్రయత్నిస్తాం. అయితే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.400 కోట్లకు పైగా మోసం చేసిన వాడు ఎవడో తెలుసు.. అయినా ఒక్కటంటే ఒక్క ఫిర్యాదు అందడం లేదు. బాధితుల సంఖ్య సుమారు వందల్లో ఉన్నా ఒక్కరూ ముందుకు రాకపోతే తామేమి చేయలేమని పోలీసులు చేతులెత్తుస్తున్నారు. ఇది యానిమేషన్ స్కాం ఉదంతంలో బాధితుల తీరు. విజయవాడ కేంద్రంగా యానిమేషన్ ప్రోగ్రామింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన కిరణ్ ఆర్థిక నేరానికి తెరదీశాడు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.వందల కోట్ల వసూలు చేసి బోర్డు తిప్పేశాడు. ఇతని బాధితుల్లో నరసరావుపేట వాసులు అధికంగా ఉన్నారు. పెట్టిన పెట్టుబడికి అధిక శాతం వడ్డీ ఆశ చూపడంతో అనేకమంది స్తోమతకు మించి అప్పులు చేసి మరీ భారీగా పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం కిరణ్ మోసం చేసి పరారవడంతో బాధితుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

సీల్ కూడా లేని అగ్రిమెంట్ కాపీలు...

రూ.లక్ష పెట్టుబడి పెట్టే సమయంలో సైతం ఇరువర్గాల మధ్య జరిగే అగ్రిమెంట్లు చాలా పక్కాగా ఉండేలా చూస్తారు. అలాంటిది పదుల కోట్ల రూపాయాలను యానిమేషన్ కంపెనీలో పెట్టుబడి పెట్టినా సరైనా పత్రం బాధితుల వద్ద ఒక్కటీ లేదంటే స్కాం ఎంత పక్కాగా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. కంపెనీ పేరుతో పెట్టుబడిదారులకు జారీ చేసిన ఒప్పంద పత్రాలలో ఎక్కడా కంపెనీ పర్మినెంట్ అడ్రస్ లేదు. విజయవాడలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కార్యాలయాన్ని నెల రోజుల క్రితం ఖాళీ చేయడంతో బాధితులకు ఎక్కడికిపోవాలో కూడా పాలుపోవడం లేదు. మరోవైపు అగ్రిమెంట్ కాపీలో పెట్టుబడులు స్వీకరించే కంపెనీ సీలు ఉండటం రివాజు. అయితే యానిమేషన్ కంపెనీ జారీ చేసిన అగ్రిమెంట్లలో 'ఓకే' అన్న అక్షరాలతో మాత్రమే సీల్ వేసి స్కామర్ కిరణ్ సంతకం చేసిన పత్రాలను జారీ చేశారు. రూ.వందల కోట్ల విలువైన కంపెనీకి సీల్ కూడా లేకపోవడం ఏంటని ప్రశ్నించలేదంటే బాధితులు అధిక వడ్డీలకు ఆశపడి ఎలా మోసపోయారో అర్థమవుతోంది.



యానిమేషన్ కంపెనీలో పెట్టుబడి పెట్టిన వారికి జారీ చేసిన ఒప్పంద పత్రంలో ఓ భాగం



పెట్టుబడి పెట్టిన వారికి జారీ చేసిన ఒప్పంద పత్రాలలో 'ఓకే' అని మాత్రమే ఉన్న సీల్

న్యాయపరంగా నిలుస్తాయా..?

ఇలాంటి పత్రాలను పట్టుకొని ఏ కోర్టు మెట్లు ఎక్కినా ఉపయోగం లేదన్న భావన బాధితుల్లో నెలకొంది. దీంతో పాటు లెక్కల్లో చూపని బ్లాక్‌మనీ అధిక మొత్తంలో ఉండటంతో ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనకడుగు వేస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. మరోవైపు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినవారికి ఒత్తిళ్లు అధికమయ్యాయి. యానిమేషన్‌లో పెట్టిన డబ్బులు తిరిగిరావని భావించిన బాధితులు ఉన్న ఆస్తులను అమ్మి తెచ్చిన అప్పులను తీర్చే పనిలో ఉన్నారు. మరికొంత మంది ఉన్న ఆస్తుల కంటే అప్పులు అధికంగా ఉండటంతో ఐపీ పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

స్పందించని ప్రభుత్వం

రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోటు ఆర్థిక నేరాలు వెలుగుచూస్తున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాధితులకు న్యాయం చేయకపోగా నిందితులకు ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఇటీవల సాయిసాధన చిట్‌ఫండ్ స్కాం బాధితులు రోడ్డెక్కి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆర్థిక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపి తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

2.5 లక్షల టన్నుల ఇసుక నిల్వచేయండి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: వర్షాకాలంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోనున్న కారణంగా జూన్ నాటికి జిల్లాలో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్లలో నిల్వచేయాలని, అందుకు స్టాక్ పాయింట్లు గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. అన్ని స్టాక్ పాయింట్లలో ఇసుక నిర్వహణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. రీచుల్లో ఇసుక తవ్వకాల కోసం ఏజెన్సీల నియామక ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ముందుగా దిడుగు–1 రీచ్‌లో ప్రయోగాత్మకంగా నామినేషన్ విధానంలో ఏజెన్సీని నియమించాలన్నారు. నామినేషన్ విధానం ఫలితాలను బట్టి మిగిలిన రీచుల్లో ఏజెన్సీల నియామకంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఐదు ఇసుక రీచులలో అక్టోబరు వరకు తవ్వకాలు చేపట్టేందుకు పర్యావరణశాఖ నుంచి అనుమతి లభించిందన్నారు. దీంతో 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకానికి అందుబాటులోకి వస్తుందన్నారు. అంబడిపూడి–1,2,3 రీచులు, కోనూరు –1 రీచుల్లో అక్టోబరు 22 వరకు, దిగుడు –1 రీచులో డిసెంబరు 30 వరకు ఇసుక తవ్వకాలకు అనుమతి లభించిందన్నారు. సదరు రీచుల పర్యవేక్షణకు ఇన్‌చార్జిలను నియమించాలని ఆదేశించారు. జిల్లా మైన్స్ – జియాలజీ అధికారి నాగిని, ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు పలు సంక్షేమ పథకాలు, వసతులను కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రాన్సిషన్ కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ అరుణ్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఆర్డీఓ మధులత, డీఈఓ ఎల్.చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగవంతంగా మాదిపాడు బ్రిడ్జి నిర్మాణం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన
- 13.45 ఎకరాలు భూసేకరణ చేసి రూ.60.50 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం



మాదిపాడు వద్ద కృష్ణానదిపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

అచ్చంపేట: మండల సరిహద్దులోని మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై వంతెన నిర్మాణ ఆవశ్యకతను గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభ్యర్థన మేరకు 2023 జూన్ 12న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించారు. అయితే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మాదిపాడు నుంచి ముక్త్యాలవరకు కృష్ణానదిపై 600 మీటర్ల పొడవు, 12మీటర్ల వెడల్పు, 14 పిల్లర్లతో వంతెన నిర్మాణం చేపట్టవలసి ఉంది. ప్రస్తుతం కృష్ణానదిలో రెండు పిల్లర్లకు అవసరమైన ఐరన్ బిగించి, బీములను భూమి లెవెల్ వరకు పోశారు.

బ్రిడ్జి నిర్మాణానికి 13.45 ఎకరాల భూ సేకరణ

వంతెనకు సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే 13.45 ఎకరాల భూమిని సేకరించారు. ఇందుకుగాను రూ.60.50 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాలవైపు 9 ఎకరాల భూమిని సేకరించారు. బ్రిడ్జి పొడవు 450మీటర్లు కాగా, వెడల్పు 12మీటర్లు. ముక్త్యాలవైపు కిలోమీటరు, మాదిపాడు వైపు అరకిలోమీటరు రోడ్డు వేయనున్నారు. కృష్ణానదిపై 14 పిల్లర్లతో బ్రిడ్జి నిర్మాణం జరగనుంది.

భళా.. రామకృష్ణ విద్యా తృష్ణ

- 58 ఏళ్ల వయస్సులో కార్డియాలజీ పీజీ పూర్తి చేసిన గుంటూరు వైద్యుడు
- గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుదైన రికార్డు
- నాలుగు పీజీలు పూర్తి



డాక్టర్ గాజుల రామకృష్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాజుల రామకృష్ణ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. సోమవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన పీజీ సూపర్ స్పెషాలిటీ పరీక్ష ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణత సాధించారు. కార్డియాలజీలో పీజీ పూర్తి చేసి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా నాలుగు పీజీ వైద్య విద్యలు జనరల్ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, న్యూరాలజీ, కార్డియాలజీ అభ్యసించారు. ఇన్‌ఫెక్షస్ డిసీజెస్, డయాబెటాలజీలో డిప్లొమో కోర్సులు పూర్తి చేశారు.

చావలి వాస్తవ్యులు

గుంటూరు జిల్లా వేమూరు మండలం చావలికి చెందిన గాజుల వీరశేఖరరావు, లీలావతి దంపతుల కుమారుడు రామకృష్ణ గుంటూరు ఎల్ఈఎం స్కూల్‌లో 7వ తరగతి వరకు చదివారు. బాలకుటీర్ స్కూల్‌లో 8 నుంచి 10వ తరగతి వరకు, గుంటూరు జేకేజీ కళాశాలలో ఇంటర్ అభ్యసించారు. గుంటూరు వైద్య కళాశాలలో 1986 – 92లో ఎంబీబీఎస్, 1998–2000లో పల్మనాలజీలో పీజీ చేశారు. 2001 నుంచి 2004 వరకు వెల్దుర్తి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. 2004 నుంచి 2006 వరకు ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రిలో ట్యూటర్‌గా పని చేశారు. 2006 నుంచి 2009 వరకు జనరల్ మెడిసిన్‌లో గుంటూరులో పీజీ అభ్యసించారు. 2009 నుంచి 2011 వరకు గుంటూరు జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2011 నుంచి 2014 వరకు తిరుపతి సిమ్స్‌లో న్యూరాలజీలో పీజీ వైద్య విద్యను అభ్యసించారు. 2014 నుంచి నేటి వరకు గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ 2022లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. పీజీ నీట్ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించి కార్డియాలజీ సూపర్‌స్పెషాలిటీ పీజీలో మంగళగిరి ఎన్నారైలో చేరారు. నేడు విజయవంతంగా కార్డియాలజీ పీజీ కోర్సు పూర్తి చేసుకుని, నాలుగు పీజీలు చదివిన ఏకైక వైద్యుడిగా అరుదైన రికార్డు డాక్టర్ రామకృష్ణ సొంతం చేసుకున్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ

తిరుపతిలో పీజీ వైద్య విద్యార్థిగా ఉన్న సమయంలో డాక్టర్ గాజుల రామకృష్ణ 86 స్పోర్ట్స్ మెడల్స్ దక్కించుకున్నారు. 33 న్యూరాలజీ క్విజ్ పోటీల్లో విజేతగా నిలిచి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. 2014లో నేషనల్ క్విజ్ పోటీలో విన్నర్‌గా నిలిచారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు
- పీజీఆర్‌ఎస్‌లో 410 వినతులు స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు వచ్చిన వినతులను తమ సొంత సమస్యగా భావించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, 48 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. నరసరావుపేట నియోజకవర్గస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం స్థానిక టౌన్ హాలులో సోమవారం నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాలకు చెందిన 410 మంది అర్జీదారుల నుంచి వినతులను కలెక్టరు, జేసీ సూరజ్ గనోరే, ఇతర అధికారులు స్వీకరించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మురళి, రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె.మధులత పాల్గొన్నారు.

రెండోసారి అర్జీ ఇస్తున్నా..



ఆరోగ్యం కోసం చేసిన అప్పును తీర్చేందుకు ఉన్న ఇంటిని అమ్ముతానంటే కుమారులు ఒప్పుకోవడం లేదు. నాకు ఐదుగురు కుమారులు, భార్య చనిపోయింది. నా ఇంట్లో ముగ్గురు కుమారులు నివాసం ఉంటున్నారు. నేను రెండో కుమారుడితో ఉంటున్నాను. చేసిన అప్పు తీర్చమంటే తీర్చరు. నేనే తీరుద్దామని ఇల్లు అమ్ముతానంటే చంపుతామని బెదిరిస్తున్నారు. ఈ పరిస్థితిపై చిలకలూరిపేటలో పీజీఆర్ఎస్ పెట్టిన సమయంలో అర్జీ పెట్టుకున్నా. అధికారులు ఎవరూ స్పందించలేదు.

–దౌరావత్ చినబికారీ నాయక్, చిలకలూరిపేట

రూ.5వేలు బోనస్ ప్రకటించాలి



ప్రభుత్వం మిర్చి రైతుకు ప్రకటించిన మద్దతు ధర రూ.11,784లు ఏమాత్రం గిట్టుబాటు కాదు. రైతుల వద్ద నుంచి రూ.6వేలు, రూ.7వేలకే కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌యార్డులో అమ్ముకున్న రైతుల వివరాలు ఆర్‌బీకేలలో ప్రకటించాలి. తక్కువధరకు అమ్ముకున్న ప్రతి రైతుకు క్వింటాకు రూ.5వేలు బోనస్ ప్రకటించాలి. అలా చేస్తేనే రైతు నష్టాల బారినుంచి బయటపడి వచ్చే ఏడాది మళ్లీ సాగుచేయగలడు.

–ఏపూరి గోపాలరావు, ఏపీ రైతు సంఘు జిల్లా కార్యదర్శి

పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలి



నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతంలో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండుసెంట్లు చొప్పున సుమారు 3వేల మందికి ఇళ్ల స్థలాలు అందజేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. విప్పర్లపల్లిలో 40ఏళ్ల నుంచి ఉంటున్న ఎస్సీ వర్గాలవారికి పట్టాలు మంజూరు చేయాలి.

– కాసా రాంబాబు, సత్యనారాయణరాజు, సీపీఐ నాయకులు

అసెంబ్లీ తీర్మానం చేయాలి



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి. సవరణ బిల్లులోని అంశాలన్నీ రాజ్యాంగ వ్యతిరేకం. ఈ చట్టంతో ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. సవరణ చట్టంకు ముందున్న వక్ఫ్ బోర్డు చట్టాన్ని అమలుచేయాలి.

–షేక్ కరిముల్లా, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగం కల్పించరూ..



మేము దివ్యాంగులం. ఇద్దరం పదోతరగతి వరకు చదువుకున్నాం. మాకెటువంటి ఆదరువు లేదు. ఉపాధి కల్పించి న్యాయం చేయండి.

–కనుమూరి గోపి, సంతోషి, అంధ దంపతులు, అప్పాపురం

బ్రిడ్జి నిర్మాణం ఆగదు

- నష్టపరిహారం తీసుకుని సహకరిస్తే మంచిది
- స్టేటస్‌కో ఇచ్చిన బిల్డింగ్‌ను కౌన్సిల్‌లో పెట్టి డిస్పోజ్ చేస్తాం
- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అనుచిత వ్యాఖ్యలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ''శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ విషయంలో ఒక్క బిల్డింగ్ యజమానికి మాత్రమే స్టేటస్ కో ఉంది. దాన్ని వదిలేస్తాం.. దిష్టిబొమ్మలాగా ఉంటుంది.. వారం రోజుల్లో కౌన్సిల్‌లో పెట్టి డిస్పోజ్ చేస్తాం.. అంత దూరం అవసరమా ?'' అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ప్రభావితమయ్యే భవన యజమానులపై ఆయన ఈ విధంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. సోమవారం 191 భవన యజమానుల్లో ప్రస్తుతం 21 మందికి మాత్రమే నష్టపరిహారం కింద చెక్కులను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ''బ్రిడ్జి నిర్మాణం ఆగదు.. మీరు ఎంత తొందరగా నష్టపరిహారం తీసుకుని సహకరిస్తే అంత మంచిది.. నిర్మాణాన్ని అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారు.. 51 మంది కోర్టుకు వెళ్లారు.. 44 మంది ప్రొసీజర్ ప్రకారం ఫాలో అవుతామని చెప్పారు.. ప్రొసీజర్ ప్రకారం డబ్బు డిపాజిట్ చేస్తాం..పొల్యూషన్స్ వచ్చేస్తాయి.. అది అవసరమా ?'' అన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పలువురు భవన యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మలేరియా డే పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట: ఈనెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ పోస్టర్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు టౌన్‌హాలులో సోమవారం ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తికి ముఖ్య కారణమైన దోమల నివారణకు సహకరించాలని కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.మధు సహకారంతో ఈ వ్యాధులకు కారణమైన దోమల స్టిక్కర్లను జిల్లాలోని అన్నీ డిపోలకు చెందిన బస్సుల్లో ఏర్పాటుచేయటం జరుగుతుందన్నారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, డ్వామా పీడీ లింగమూర్తి, ఆర్డీఓ కె.మధులత పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుడు హల్‌చల్

- గంజాయి కావాలంటూ చిల్లర దుకాణంలో గొడవ
- దుకాణ నిర్వాహకులపై దాడి
- ప్రశ్నించిన స్థానికులపైనా రాళ్ల దాడి

నరసరావుపేటటౌన్: గంజాయి తాగిన ఓ యువకుడు చిల్లర దుకాణంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి తనకు గంజాయి కావాలని దుకాణ నిర్వాహకులపై దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి బరంపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. బరంపేట సింధు స్కూల్ సమీపంలో చిల్లర దుకాణంలోకి గంజాయి మత్తులో ఉన్న యువకుడు వచ్చి తాను సేవించించేందుకు గంజాయి ప్యాకెట్లు కావాలని అడిగారు. ఇక్కడ అమ్మరని దుకాణ నిర్వాహకురాలు చెప్పటంతో ఆమెతో వాగ్వివాదానికి దిగాడు. దుకాణ నిర్వాహకురాలి కుమారుడు కలుగజేసుకొని వారించగా అతనిపై దాడికి పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారంతా ఇదేమని ప్రశ్నించడంతో రోడ్డు పక్కనే ఉన్న రాళ్లతో వారిపై దాడి చేశాడు. దీంతో భయాందోళన చెంది వారంతా పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకునే సరికి యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

ముందే మూసినా.. కిక్కురుమనరు!

- చిలకలూరిపేటలో వైన్‌షాపులను గంట ముందే మూసివేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

చిలకలూరిపేట: మద్యం సిండికేట్లు మరోమారు వైన్‌షాపుల వేళలు కుదించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణ పరిధిలో ఆరు వైన్‌షాపులు, పురపాలక సంఘంలో విలీన గ్రామం గణపవరంతో కలిపి 11 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో ఆరు వైన్‌షాపులు, 10 బార్ షాపుల వారు సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారని ప్రచారంలో ఉంది. ఇంకేముంది వారు ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతోంది. బార్‌షాపుల్లో కన్నా వైన్‌షాపుల్లో మద్యం రేట్లు తక్కువగా ఉంటాయన్నది అందరికీ తెలిసిన విషయమే. వైన్ షాపుల కన్నా బార్ షాపుల్లో క్వార్టర్‌కు రూ. 50 వరకు అదనంగా చెల్లించుకోవాల్సి ఉంటుంది. వైన్ షాపులు మూసివేయాల్సిన సమయం రాత్రి 10 గంటలు కాగా, బార్ షాపులు రాత్రి 11 గంటల వరకు ఉంటాయి. ఈ క్రమంలో బార్ అండ్ రెస్టారెంట్ల వారు, వైన్ షాపుల యజమానులు గత మార్చిలోనే సిండికేట్‌గా ఏర్పడి వైన్‌షాపుల సమయం రాత్రి 10 నుంచి 9గంటలకు అనధికారికంగా తగ్గించారు. ఈ విషయమై మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో అప్పట్లో కొద్దిరోజులు వెనకడుగు వేసిన మద్యం సిండికేట్లు మళ్లీ చెలరేగుతున్నారు.



పట్టించుకోని అధికారులు

గత మూడు రోజుల నుంచి తిరిగి రాత్రి 9గంటలకే వైన్ షాపులు మూసివేస్తున్నా, నిబంధనలు అమలు పరచాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు వైన్‌షాపుల్లో మద్యం సేవించేందుకు అనుమతులు లేకున్నా దర్జాగా అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసి మద్యం తాగిస్తున్నారు. దుకాణదారులంతా అధికారపార్టీకే చెందిన వారు కావడంతో వారికి అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. రాత్రిళ్లు వైన్‌షాపుల సమయం అధికారికంగా తగ్గించటంతో గతిలేని పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లకు వెళ్లి అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని మందుబాబులు వాపోతున్నారు.

వారు ఆడిందే ఆట...

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన దగ్గరి నుంచి అధికార పార్టీ నాయకులు ఆడిందే ఆటగా మద్యం వ్యవహారం నడుస్తోంది. చిలకలూరిపేట పట్టణ పరిధిలో మూడు బార్ అండ్ రెస్టారెంట్లను సత్తెనపల్లికి చెందిన ఓ మద్యం వ్యాపారి నిర్వహించేవాడు. గత ఏడాది జూలైలో ఈ మూడు షాపులపై కొందరు అధికార పార్టీ నాయకులు తమకు 50శాతం వాటా ఇవ్వాలని దౌర్జన్యానికి దిగడంతో దిక్కులేని పరిస్థితుల్లో మద్యం వ్యాపారి మూడు దుకాణాలను మూసివేసి, నష్టానికి షాపులను విక్రయించుకొని వెళ్లి పోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా ఎవరివో లాభాల కోసం నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపులు సమయం కన్నా ముందు మూసివేయడం సరికాదని మందుబాబులు విమర్శిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం...



వైన్ షాపులను రాత్రి 9 గంటలకే మూసివేయడం నిబంధనలకు విరుద్ధం. ఈ విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. విచారించి, తగు చర్యలు తీసుకుంటాం.

– వినయ్ కుమార్, ఎక్సైజ్ సీఐ

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

డీఎఫ్‌ఓ శ్రీధర్‌బాబు

దాచేపల్లి: వేసవిలో అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి (డీఎఫ్‌ఓ) పి.శ్రీధర్‌బాబు కోరారు. మండలంలోని గామాలపాడు సాగర్ సిమెంట్స్‌లో అగ్నిమాపకాలు – వాటి నివారణపై కార్మికులకు సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎఫ్‌ఓ మాట్లాడుతూ.. పనిచేసే చోట నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని, పని చేసే ప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక పరికరాలు ఎప్పుడు పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని, భవనాలు, లిఫ్టలలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మెట్ల మార్గాలను ఉపయోగించాలని సూచించారు. పరిశ్రమల్లో పచ్చదనం పెంపుదల కోసం చెట్లను ఎక్కువగా పెంచుతారని, వేసవిలో చెట్లు కొంతమేర ఎండిపోవటం వలన అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయని వివరించారు. పరిశ్రమల్లో విద్యుత్ ఉపకరణాల పనితీరును తరచుగా పర్యవేక్షించాలని, చమురు లీకేజీలు గుర్తించి అగ్నిప్రమాదాలు జరగకుండ ముందస్తుగానే నివారించాలని చెప్పారు. అనంతరం కార్మికులు, విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, అధికారులు నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నాగేశ్వరరావు, వీరప్రకాష్, నాగభూషణం, నరసింహులు, భరత్‌భూషణ్, రామకృష్ణ, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

వినుకొండ: మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన ఇరువురు తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలు ఆ పార్టీ వినుకొండ ప్రధాన కార్యా లయంలో తన్నుకోవడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నేత, ఉమ్మడివరం గ్రామ సర్పంచ్ వీరగంధం ఆనంద్, అదే గ్రామానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి వీరగంధం ప్రశాంత్ ఇరువురు గ్రామంలో జరిగే తిరునాళ్ల సందర్భంగా ప్రభలు కట్టే విషయంలో తేడాలు వచ్చాయి. దీంతో ఈ విషయమై చర్చించుకునేందుకు టీడీపీ నియోజకవర్గ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో మాటా మాట పెరిగి కార్యాలయంలోనే తన్నుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. ఎట్టకేలకు నాయకుల చొరవతో గొడ వ సద్దుమణిగిన అనంతరం ప్రభలు నిర్మించుకునేందుకు పోలీసులు అనుమతి ఇచ్చినట్లు సమాచారం.

సత్తెన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి

సత్తెనపల్లి: సత్తెన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో సోమవారం సత్తెన్న విగ్రహ మూడవ వార్షికోత్సవం జరిగింది. పట్టణ, నియోజకవర్గ వడియ రాజుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవళ్ళ మురళి మాట్లాడుతూ సత్తెన్న ఆశయ సాధన కోసం వడ్డెరలంతా కలిసి కట్టుగా పని చేయాలన్నారు. ముఖ్యంగా వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలన్నారు. కొండ కోరీలు అనేవి వడ్డెరుల హక్కు అని, ప్రస్తుతం వాటిని కొన్ని రాజకీయ పార్టీలు కొల్లగొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ కోరీలలో 30 శాతం లీజులు లేకుండా కేటాయించాలని, కాంట్రాక్ట్ పనులలో ఈఎండీ లేకుండా 30 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్డెర సంఘ నాయకులు బత్తుల సాంబశివరావు, కొమెర శివశంకరరావు, కందులూరి నాగేశ్వరరావు, దేవళ్ల నాగయ్య, తిరుపతి సురేష్, వేముల వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దేవళ్ల మురళి, తదితరులు

సత్తెన్న ఆశయ సాధనే లక్ష్యం..

సత్తెనపల్లి: సత్తెన్న ఆశయ సాధనే లక్ష్యంగా పని చేద్దామని ఏపీ వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది వేముల బేబీ రాణి పిలుపు నిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో సత్తెనపల్లి గడ్డ ఎత్తిన సత్తెన్న విగ్రహావిష్కరణ మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సత్తెన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర సంఘ నాయకులు ఒంటిపుల్లి నాగేశ్వరరావు, వేముల శ్రీదేవి, పల్లపు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- జిల్లా పోలీసు కార్యాలయ పీజీఆర్ఎస్‌కు 94 ఫిర్యాదులు
- స్వీకరించిన అదనపు ఎస్పీ సంతోష్

నరసరావుపేట: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిసానంటూ ఓ వ్యక్తి తన వద్ద నుంచి రూ.6లక్షలు తీసుకొని మోసం చేశాడంటూ నరసరావుపేట పట్టణం కొండలరావుపేటకు చెందిన మల్లికార్జునరావు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం, చోరీలు తదితర సమస్యలకు సంబంధించి 94 ఫిర్యాదులు స్వీకరించారు.



ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్య వింటున్న జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ సంతోష్

విదేశాల్లో ఉద్యోగం పేరిట రూ.6లక్షలు మోసం

నేను మార్కెట్ సెంటర్‌లో కుమారస్వామి లాడ్జిని నిర్వహిస్తుండగా గుంటూరుకు చెందిన ఎస్.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఒకరోజు మా లాడ్జికి వచ్చాడు. తాను ఒక ఛానల్‌లో పనిచేస్తున్నానని చాలామందిని విదేశాలకు పంపానని, అందరూ మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని, నిన్ను కూడా అమెరికా పంపిస్తానని అందుకు రూ.20లక్షలు ఖర్చవుతుందని నమ్మబలికి నా వద్ద నుంచి రూ.6లక్షలు తీసుకున్నారు. ఐదు నెలలు అవుతున్నా ఉద్యోగం, డబ్బుల గురించి ఏ విధమైన సమాచారం ఇవ్వలేదు. గట్టిగా అడిగితే డబ్బులు ఇవ్వను, మీకు చేతనైంది చేసుకో, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకోండి.

–పి.మల్లికార్జున్, కొండలరావుపేట, నరసరావుపేట

ఇల్లు అమ్ముతామని రూ.50వేలు కాజేశారు

పాలపాడురోడ్డులో ఓ ఇల్లు రూ.35లక్షలకు విక్రయానికి వచ్చిందని బ్రోకర్లు నారాయణ, మరో వ్యక్తి వచ్చి చెప్పి నమ్మించి ఇల్లు చూపించి నా వద్ద నుంచి ఇంటి యజమానికి రూ.11వేలు అడ్వాన్స్‌గా ఫోన్‌పే ద్వారా ఇప్పించారు. పది రోజుల తర్వాత బ్రోకర్ నా వద్దకు మరోసారి వచ్చి మీరు చూసిన ఇల్లు వేరే వారు తీసుకుంటున్నారని చెప్పి నా వద్ద నుంచి మరో రూ.39వేలు ఫోన్ పే ద్వారా యజమానికి మొత్తం రూ.50వేలు అడ్వాన్స్ కింద ఇప్పించారు. అగ్రిమెంటుకు రమ్మని బ్రోకర్ ద్వారా ఓనర్ శ్రీనివాసరావుకు కబురు పంపగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడు. నీకు ఇల్లు అమ్మడం లేదని, ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి ఇవ్వబోమని బెదిరించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని నా అడ్వాన్స్ డబ్బులు నాకు ఇప్పించండి.

–డి.ఆనంద్, పెద్దచెరువు, నరసరావుపేట

సెరి కల్చర్ సాగు పేరుతో రూ.34లక్షలు మోసం

నేను ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ చదువుతుండగా కృష్ణాజిల్లా ఘంటసాల మండలం పాపవినాశం గ్రామానికి చెందిన సాగర్ నాయుడు అను అతను పరిచయం అయ్యాడు. సెరికల్చర్ వ్యవసాయంలో అధిక లాభాలు వస్తాయని నన్ను అతను, అతని తండ్రి జోసఫ్ కృష్ణ నమ్మించి రూ.34లక్షలు బ్యాంకు ద్వారా వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఆ తర్వాత మోసపోయిన విషయాన్ని తెలుసుకొని డబ్బులు ఇవ్వమని కోరగా, మేము డబ్బులు ఇవ్వం మీకు దిక్కున చోట చెప్పుకో, నీకు చేతనైన చేసుకోమని బెదిరిస్తున్నారు.

–జరుగుమల్లి అరుణ్, చిలకలూరిపేట

అక్రమంగా పొలం ఆన్‌లైన్ చేయించుకొన్నారు

నేను అంజిరెడ్డి అనే అతనికి పొలం తాకట్టుపెట్టి కొంత డబ్బులు తీసుకొని వడ్డీతో సహా చెల్లించాను. అయితే మోసం చేసి నా పొలాన్ని తన పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నాడు. ఇదేమని అడిగితే నాపై దుర్భాషలాడి, కర్రతో దాడి చేశాడు. అతనిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–ఏలూరి రాంప్రసాదు, రైతునగరం, రొంపిచర్ల

హత్యాయత్నం కేసులో ఏడుగురికి నాలుగేళ్ల జైలు

నరసరావుపేటటౌన్: హత్యాయత్నం కేసులో నేరం రుజువుకావటంతో ఏడుగురు ముద్దాయిలకు ఒక్కొక్కరికీ నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక సహాయ సెషన్స్ న్యాయమూర్తి కె.మధుస్వామి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 జూలై 30వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలో పంపు నీళ్ల తెచ్చుకునే విషయమై చోటు చేసుకున్న వివాదం నేపథ్యంలో బిరుదు రవి, బిరుదు అనంతలపై అదే గ్రామానికి చెందిన కారుచోళ సుభాని, పెద్ద అంజయ్య, చిన్న కోటి లింగయ్య, మణికుమార్, బుజ్జి, పెద్ద కోటి లింగయ్య, హనుమంతరావులు కత్తి, గొడ్డళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

అకాల వర్షం .. పొగాకు రైతుకు తీవ్ర నష్టం

కన్నీటి పర్యంతమవుతున్న రైతులు

పెదకూరపాడు: ఆరుకాలం శ్రమించి సాగుచేసి పండించిన పంట చేతికి అందేలోపు జారిపోయింది. అపార నష్టం మిగిల్చింది. రైతుల కంట కన్నీరు మిగిల్చింది. పెదకూరపాడు నియోజకవర్గంలో 300 ఎకరాల్లో సాగు చేసిన పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పెదకూరపాడు మండలంలో ఈ ఏడాది పొగాకును గణనీయంగా సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన అకాల వర్షంతో సుమారు 30 ఎకరాల్లో పంట, దిగుబడులు తడిచిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

తగలబెడుతున్న వైనం..

పెదకూరపాడుకు చెందిన షేక్ యాసిన్ అనే రైతు ఆరు ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశాడు. దిగుబడి బాగానే వచ్చింది. ఓ పొగాకు కంపెనీవారు టన్ను రూ.1.08లక్షలకు బేరం ఆడి వెళ్లారు. పంట కంపెనీకి తరలించేందుకు వారం రోజుల ముందు పంటపొలంలోనే పొగాకును ఆరబెట్టారు. అయితే ఇటీవల కురిసిన అకాల వర్షంతో పొగాకు తడిసి, ముద్దయి.. అనంతరం మెత్తబడింది. రెండు రోజుల్లోనే నల్లగా రంగుమారి తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పంటను చూసి రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. దిగుబడి అయిన నలుగు టన్నులతో పాటు పంట పొలంలో ఉన్న నాలుగు టన్నుల పంట కూడా తడిచి చీకి పోవడంతో కంపెనీ వారు కొనుగోలు చేయడం లేదని, మొత్తం రూ.10 లక్షల వరకు నష్టం రావండతో పొగాకును కాల్చివేశినట్లు యాసిన్ తెలిపారు.




తడిచిన పొగాకును కాల్చి వేస్తున్న రైతులు

మినీలారీ బోల్తా

యడ్లపాడు: టైర్ పంక్చర్ కారణంగా మినిలారీ పల్టీ కొట్టిన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఒంగోలు నుంచి గుంటూరు వైపు టైల్స్ లోడుతో వెళ్తున్న వాహనం, తిమ్మాపురం గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. వాహనం వెనుక టైర్ పంక్చర్ కావడం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోయి లారీ తిరగబడి ప్రమాదం జరిగింది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. వాహనం ముందుభాగం, గ్రానైట్ టైల్స్ ధ్వంసం అయ్యాయి. యడ్లపాడు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని, వాహనం తొలగించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ఉద్యమించాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధిని ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వానికి పలు సూచనలు చేసేందుకు శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో పల్నాడురోడ్డులోని కార్యాలయంలో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సమావేశానికి పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక సంస్థలకు ప్రజలు తాము చెల్లించే పన్నులో 8 శాతం గ్రంథాలయాల పన్నుగా ఉంటుందన్నారు. ఆ నిధులతో గ్రంథాలయాల ఏర్పాటు, అభివృద్ధిని ప్రభుత్వాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. గ్రంథాలయాల పరిరక్షణకు ఈనెల 27వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పల్నాడు జిల్లాలో గ్రంథాలయాల అభ్యున్నతికి స్వర్ణ చినరామిరెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ఈసందర్భంగా గ్రంథాలయ పునర్వికాస వేదిక పల్నాడు జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా చినరామిరెడ్డి, కో-కన్వీనర్‌గా షేక్ బాజీ, సభ్యులుగా బత్తుల మురళి, ఈవూరి వెంకటరెడ్డి, డి.వెంకటేష్, ఎస్.వి.చలమారెడ్డి తదితరులను నియమిస్తూ నిర్ణయించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ, జిల్లా కార్యదర్శి కోసూరి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నకరికల్లు: ఇరువర్గాల జరిగిన మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుని ఘర్షణకు దారితీసింది. ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని కుంకలగుంట గ్రామంలో జరిగిన సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి.. కుంకలగుంట గ్రామానికి చెందిన ఓ యువకుడిని ఆకతాయి పనులు చేస్తున్నందుకుగాను అదేగ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం రాత్రి దాడిచేశాడు. అనంతరం ఇరువర్గాలు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.